# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 29-10-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- రఫేల్ యుద్ధ విమానాలు భారత రక్షణ రంగానికి గర్వకారణమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.

- భారతదేశ సముద్ర రంగం వేగవంతమైన అభివృద్ధిని సాధిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

- బొగ్గు రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు.

- మొంథా తుఫాను వాయుగుండంగా మారిందని, దీని ప్రభావంతో తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = =

రఫేల్ యుద్ధ విమానంలో గగనవిహారం చేయడం మరపురాని అనుభవమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. దేశ రక్షణ సామర్థ్యాలపై మరింత గర్వాన్ని నింపే విధంగా ఈ ప్రయాణం సాగిందని సామాజిక మాధ్యమం ఎక్స్ లో రాష్ట్రపతి పోస్టు చేశారు. ఈ విన్యాసాన్ని విజయవంతంగా నిర్వహించిన భారత వైమానిక దళ బృందాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు హర్యానాలోని అంబాలా వైమానిక దళ కేంద్రం నుండి రఫేల్ యుద్ధ విమానంలో దాదాపు 25 నిమిషాల పాటు ప్రయాణించారు. అంతకు ముందు స్థానిక వైమానిక దళ కేంద్రానికి చేరుకున్న రాష్ట్రపతికి ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్, హర్యానా రాష్ట్ర మంత్రి అనిల్ విజ్, అంబాలా డిప్యూటీ కమీషనర్ అజయ్ సింగ్ తోమర్ తదితరులు స్వాగతం పలికారు. ఇదిలా ఉండగా, ఈ ఏడాది పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌పై భారత్ జరిపిన ఆపరేషన్ సిందూర్ దాడులలో రఫేల్ జెట్లు కీలక పాత్ర పోషించాయి.

= = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ సముద్ర రంగం వేగవంతమైన అభివృద్ధిని సాధిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ముంబైలో ఈ రోజు జరిగిన ఇండియా మారిటైమ్ వీక్ 2025 సదస్సులో ముఖ్య అతిథిగా ప్రధానమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సముద్ర రంగానికి సంబంధించి తదుపరితరం సంస్కరణల వైపుగా భారతదేశం నిర్ణయాలు తీసుకుంటోందని చెప్పారు. ఈ క్రమంలో షిప్పింగ్ చట్టాలను 21వ శతాబ్దానికి సరిపోయే విధంగా రూపొందించామని తెలిపారు. భారతదేశ ఓడరేవులు ప్రపంచంలో అత్యంత సమర్థవంతమైనవిగా ఉన్నాయని గుర్తు చేశారు. దేశీయ నౌకా నిర్మాణ రంగం మరింతగా విస్తరించడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

రాబోయే సంవత్సరాల్లో తపాలా శాఖ మొత్తం ఆదాయంలో కనీసం 75 శాతం పార్శిల్ మెయిల్ సేవలపై లభించేలా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖా మంత్రి జ్యోతిరాదిత్య సింధియా పేర్కొన్నారు. దేశంలో తపాలా శాఖ రెండవ త్రైమాసికంలో ఉత్తమ పని తీరును కనబరిచిందని చెప్పారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన తపాలా శాఖ వార్షిక వ్యాపార ప్రణాళిక 2025-26 సమీక్ష అనంతరం పాత్రికేయులతో కేంద్రమంత్రి మాట్లాడుతూ... ఢిల్లీ 149 శాతంతో, తెలంగాణ 112 శాతంతో నిర్దేశించిన లక్ష్యాలను తపాలా శాఖ అధిగమించిందని తెలిపారు. డిజిటలైజేషన్ తో పాటు తపాలా కార్యాలయాలను ఆధునీకరించడం ద్వారా భారతీయ తపాలా శాఖ కొత్త రూపు సంతరించుకొందని చెప్పారు. దీని వలన రానున్న కాలంలో తపాలా శాఖ మూడు నుండి నాలుగు రెట్లు వేగంగా అభివృద్ధి చెందడానికి సాధ్యమవుతుందని జ్యోతిరాదిత్య సింధియా అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

బొగ్గు రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్ర బొగ్గు గనుల శాఖా మంత్రి జి. కిషన్ రెడ్డి చెప్పారు. న్యూఢిల్లీలో 14వ విడత వాణిజ్య బొగ్గు గనుల వేలాన్ని ఆయన దృశ్య మాధ్యమం ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బొగ్గు రంగంలో వ్యాపారాన్ని సులభతరం చేయడంతో పాటు  భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ఈ వేలం ఉద్దేశమని తెలిపారు. బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ మొదటి సారిగా భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్ కోసం వేలం విధానంలో కొత్త  నిబంధనలను ప్రవేశపెడుతోందని తెలిపారు. ఇది తవ్వలేని బొగ్గు నిల్వలను వెలికి తీసేందుకు సహాయపడుతుందని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపటి నుండి రెండు రోజుల పాటు గుజరాత్ రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా రేపు కెవాడియాలోని ఏక్తా నగర్‌లో ఒక వెయ్యి 140 కోట్ల రూపాయల విలువైన మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. అదే విధంగా ఈ నెల 31న ప్రధానమంత్రి రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకల్లో పాల్గొని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పిస్తారు. అనంతరం ఏక్తా దివస్ ప్రతిజ్ఞ, ఏక్తా దివస్ పరేడ్‌లో కూడా నరేంద్ర మోదీ పాల్గొంటారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

బీహార్ రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రచారం ఊపందుకుంది. ఎన్డీయే, మహాఘట్ బంధన్ కూటముల నుంచి ప్రధాన నాయకులు ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. సివాన్ జిల్లాలోని రఘునాథ్‌పూర్‌లో ఈరోజు జరిగిన బహిరంగ సభలో బీజేపీ సీనియర్ నాయకులు, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ... ఎన్.డి.ఎ. మరోసారి అధికారంలోకి వస్తే బీహార్ మెరుగైన శాంతిభద్రతలతో అభివృద్ధి చెందిన

రాష్ట్రంగా మారుతుందన్నారు. సమస్తిపూర్‌లోని సరాయ్ రంజన్ లో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో మహాఘట్ బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి ప్రసాద్ యాదవ్ ప్రసంగిస్తూ... తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర పంచాయతీ రాజ్, గిరిజన వ్యవహారాలు, విద్యా మంత్రిత్వ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఆదర్శ యువజన గ్రామ సభ (MYGS)ను న్యూఢిల్లీలో రేపు ప్రారంభిస్తున్నారు. గ్రామసభ సమావేశాలలో విద్యార్థులను పాల్గొనేలా చేయడం MYGS లక్ష్యమని కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది. దేశవ్యాప్తంగా వెయ్యికి పైగా పాఠశాలల్లో MYGSని అమలు చేయనున్నట్లు ఆ శాఖ వెల్లడించింది. రేపు జరిగే MYGS ప్రారంభ కార్యక్రమానికి కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ సహాయ మంత్రి ఎస్.పి. సింగ్ బఘేల్, గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి దుర్గాదాస్ ఉయికే హాజరవుతారని ఆ ప్రకటనలో పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 84 వేల 628 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరికి 369 పాయింట్ల లాభంతో 84 వేల 997 వద్ద ముగిసింది. నిఫ్టీ 117 పాయింట్ల లాభంతో 26 వేల 053 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64.48 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4 వేల 027 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = =

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బీహార్‌లోని ముజఫర్‌పూర్ నుండి మహాఘట్ బంధన్ ఎన్నికల ప్రచారాన్ని ఈరోజు ప్రారంభించారు. ముజఫర్‌పూర్‌లోని సక్రాలో జరిగిన బహిరంగ సభలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ... సామాజిక న్యాయం పట్ల బీజేపీకి ఎటువంటి శ్రద్ధ లేదని, అందుకే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కుల గణనను వ్యతిరేకించారని ఆరోపించారు. బీహార్ లో మహాఘట్ బంధన్ అధికారంలోకి వస్తే పరిశ్రమలను స్థాపించడంతో పాటు రాష్ట్ర ప్రజలకు ఉపాధి అవకాశాలను కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = =

మొంథా తుఫాను వాయుగుండంగా మారింది. ఇది ఉత్తర వాయువ్య దిశగా భద్రాచలానికి 50 కిలోమీటర్లు, ఖమ్మంకి 110 కిలోమీటర్ల దూరంలో ఒడిషాలోని మల్కాన్ గిరికి 130 కిలోమీటర్ల వద్ద కేంద్రీకృతమై ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అధికారి అమిత్ కుమార్ పేర్కొన్నారు. దీని ప్రభావంతో తెలంగాణా, ఒడిషా, ఛత్తీస్ ఘడ్ లలో రానున్న రెండు రోజులూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. తెలంగాణలోని 12 జిల్లాలకు అతి భారీ వర్షపాతం ఉంటుందని ఆయన పేర్కొంటూ....

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = =